జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
బుధవారం | 1 | జులై | 2026 ◆ పేజీలు : 6



# ఓటరు నమోదులో తప్పిదాలకు తావొద్దు కల్లూరు సబ్ కలెక్టర్



**కల్లూరు, జూన్ 30 : ప్రజాజ్యోతి** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR - 2026) లో భాగంగా చేపడుతున్న ఏన్యూమారేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరు మండలంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 108 తో పాటు

మిగతా 2 లో...



# వ్యవసాయం అంటే... పండగలా తీర్చిదిద్దుతాం...

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక నుండి రైతు భరోసా లో భాగంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి హాజరై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకాటి శ్రీహరి, రాష్ట్రం లోని వివిధ ప్రాంతాలలోని రైతు వేదికల ద్వారా జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా, చింతకాని మండలం నాగులవంచ గ్రామం లోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న

మిగతా 2 లో...

# యూరియా యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా యూరియా సరఫరా



- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు.. వానా కాలం పంటసాగు కు కావలసిన యూరియా కు కొరత లేదు
- చింతకాని మండలం లోని ఎరువుల గోడౌన్లు, విక్రయ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**చింతకాని జూన్ 30 ప్రజాజ్యోతి :** ఖమ్మం జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు 18832.34 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోగా, పాత నిల్వలను కలుపుకొని 24903.7 మెట్రిక్ టన్నుల

మిగతా 2 లో...

# బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విశ్వశాంతి విద్యార్థులు

- అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు సత్కారం



**సత్తుపల్లి జూన్30(ప్రజా జ్యోతి)** 10వ తరగతి లో అత్యధిక మార్కులు సాధించడం ద్వారా,బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విశ్వశాంతి విద్యార్థులు కే. అఖిల్, యండి అర్ఫాజ్ అలీ లను మంగళవారం ఘనంగా సత్కరించారు. అఖిల్ ఎస్సెస్సీలో 574 మార్కులు సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు . ప్రభుత్వ బీసీ హాస్టల్ లో ఉంటూ పది లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా హైదరాబాద్ లో

మిగతా 2 లో...

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అడ్మినిస్ట్రేటివ్ కడవెండి శ్రీనివాస్,శోభారాణి జన్మదిన వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** ఖమ్మం వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ వారిచే నిర్వహించబడినది.సేవ పరమార్థంగా భావనతో నిండిన స్వచ్ఛమైన మనసుతో ఆర్తులను ఆదుకోవాలని ఆకాంక్ష దాని ప్రతిరూపమే నేడు జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నేడు జేష్ట/ ఏరువాక పౌర్ణమి అత్యంత పవిత్రమైన పర్వదినం ,నేడు పుణ్య దంపతులు కడివెండి శ్రీనివాస్,శోభారాణి లకి జన్మదినం ఒకే రోజు కావడం శుభదాయకం , నిరుపేద ఆర్యవైశ్యునికి చికిత్స నిమిత్తం నగదు, కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత .ఇందిరా నగర్ పర్ణశాల శ్రీ కోదండ రామస్వామి దేవాలయము నందు భక్తుల సౌకర్యార్థం సిమెంట్ బెంచి వితరణ. ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని

మిగతా 2 లో...

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అడ్మినిస్ట్రేటివ్ కడవెండి శ్రీనివాస్,శోభారాణి జన్మదిన వేడుకలు



(మొదటి పేజీ తరువాయి...)

ఆలయమునందుగల గోమాతలకు దాణ , గ్రాసము , పచ్చగడ్డి అందజేత .ఆలయ ప్రాంగణంలో మామిడి మొక్కలు నాటుట.కార్యక్రమమునకు విచ్చేసి కడివండి శ్రీనివాస్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువా తో సత్కరించిన ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ కన్వీనర్ , ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ,విసిఐ పొదుమూరి జగన్నాథం మరియు ,ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు , వాసవి క్లబ్ బాధ్యులు , తేలుకుంట్ల ధనుంజయ, కడవండి శ్రీనివాస్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలవాతో సత్కరించమైనది. వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్ష కార్యదర్శ్ కోశాధికారులు శ్రీ మారేమల్ల రామకృష్ణసుగ్గల శ్రీహరి గోపాలకృష్ణమూర్తి, కడివెండి శ్రీనివాసు లకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు జోన్ చైర్మన్ వేమిశెట్టి మోహన్ దాస్, శ్రీనివాస్ లకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమనకు విచ్చేసిన రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు ని శాలువాతో కడవెండి శ్రీనివాసు సత్కరించారు ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ ప్రోగ్రాం చైర్మన్ సెక్రటరీ బూర్ల పుల్లారావు తదితరులు ,ఆలయ కమిటీ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విశ్వశాంతి విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి...)

రూ.10 వేల నగదు పురస్కారాన్ని, సన్మానం అందుకున్నాడు.

**అర్ఫాజ్ కు పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్....**

అర్ఫాజ్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడమే కాకుండా తెలంగాణ పాలిసెట్–2026లో 120కు 120 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ ర్యాంక్ ను కైవసం చేసుకున్నాడు.ప్రస్తుతం ఓ ప్రముఖ కార్పొరేట్ కళాశాల అర్ఫాజ్ కు ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా అందజేస్తుంది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పాఠశాల ప్రిన్సిపాల్ సూచించారు.

## ఓటరు నమోదులో తప్పిదాలకు తావొద్దు కల్లూరు సబ్ కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)

పెనుబల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 132 సందర్శించి డిజిటైజేషన్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు వివరాల ఖచ్చితత్వం డేటా ఎంట్రీ నాణ్యతను పరిశీలించిన సబ్ కలెక్టర్ ప్రతి ఏన్యూమరేషన్ ఫారాన్ని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తిస్థాయిలో పరిశీలించి డిజిటైజ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిజిటైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు వివరాల నమోదులో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా ధ్రువీకరించి నమోదు చేయాలని ఎలాంటి లోపాలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం..

(మొదటి పేజీ తరువాయి...)



అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులను ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ లో భాగంగా 25 లక్షల 35 వేల మంది రైతులకు 20 వేల 677 ఓట్ల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందని, రైతు భరోసాలో భాగంగా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందని తెలిపారు.ఇప్పటివరకు 27 వేల కోట్ల రూపాయల రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ప్రస్తుతం 9 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మొత్తంగా 36 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కొరకు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, 4 వేల కోట్ల రూపాయల బోనస్, 2 వేల కోట్ల రూపాయలతో పనిముట్లు, రైతు భీమా పథకం కొరకు 3 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల వద్ద నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 80 వేల కోట్ల రూపాయలు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 1 లక్ష 75 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగం కోసం ఖర్చు చేయడం జరిగిందని, సరాసరి ప్రతి నెల 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.నష్టాలలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను 1 వేయి కోట్ల లాభాలలోకి తీసుకురావడం జరిగిందని,సింగరేణి, విద్యుత్, ఆర్థిక, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడం జరిగిందని, రెవెన్యూ శాఖలో భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మహిళల సంక్షేమంలో భాగం గా మహాలక్ష్మి పథకంలో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు 11 వేల కోట్ల రూపాయలు ఆర్ టి సి సంస్థకు చెల్లించామని తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, పెట్రోల్ బంకులు నడిపించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని,హైదరాబాద్ లోని ఐ.టి. సంస్థల మధ్య 1 వేయి కోట్ల రూపాయల భూమిని ఇందిరా మహిళ భవన్ కు కేటాయించి స్వయం సహాయక సంఘాల ద్వారా 150 షాపులు ఏర్పాటు చేసి నిర్వహణకు అవకాశం కల్పించడం జరిగిందని, రాష్ట్రంలో దాదాపు 8 వేల స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒకేసారి సమావేశం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లా కేంద్రాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా గ్రూప్ 1 నిర్వహించి 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని, గ్రూప్ 2లో 1 వేయి 100 మంది, అన్ని ప్రభుత్వ శాఖలలో దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు.

ఈ సంవత్సరం రాష్ట్రంలో నెలకొన్న వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి కాలానుగుణంగా దిగుబడి వచ్చే పంట సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా ప్రభుత్వమని, ప్రతి రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాగులవంచ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా యూరియా సరఫరా

(మొదటి పేజీ తరువాయి...)



యూరియా అందుబాటులో వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 6071.13 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకం అయినట్లు కలెక్టర్ అన్నారు. మంగళవారం చింతకాని మండలం లోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు.ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా రైతుల మొబైల్ ఫోన్ లో పరిశీలన చేసి యాప్ వల్ల సమకూరే ప్రయోజనాలను రైతులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, యూరియ లభ్యత పై రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని, ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు.జిల్లాతో పాటు మీ మండలంలో ఉన్న స్టాక్ వివరాలు కూడా యాప్ లో తెలుస్తాయని తెలిపారు. అదేవిధంగా యూరియా కు ప్రత్యామ్నాయగా నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు సూచించారు. రైతులను నానో యూరియా కొనాలని డీలర్లు, బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని,ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.రైతులు పంటల అవసరంమేరకు మాత్రమే మోతాదుకు మించకుండా ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించే విధంగా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, చింతకాని మండల తహసీల్దార్ కిలారి బాబ్జీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది డైవర్షన్ పాలిటిక్స్

- బీఆర్ఎస్ నేతలు బొమ్మెర రామ్మూర్తి, ఉబ్బలపల్లి నిరోషా




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నాయకులు, మంత్రులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, బీఆర్ఎస్ నాయకులపై చేస్తున్న వ్యక్తిగత దూషణలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి,న్యాయవాది ఉబ్బలపల్లి నిరోషా తీవ్రంగా ఖండించారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు.అధికార మదంతో ఊరకుక్కల్లా మొరుగుతున్నారు.బొమ్మెర రామ్మూర్తి మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి మాట్లాడుతూ గత మూడు నాలుగు రోజుల నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయన అనుచరులు బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్‌రావులతో పాటు జిల్లా నాయకులు పువ్వాడ అజయ్ కుమార్, తాతా మధుసూదన్ లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆర్థిక ఉగ్రవాది, భూ బకాసురుడు గతంలో కాంగ్రెస్ నేత బట్టి విక్రమార్క అన్నట్లే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ఆర్థిక ఉగ్రవాది అని, ప్రాజెక్టులు,కాంట్రాక్టులు,కమిషన్ల పేరుతో జిల్లాను దోచుకుంటున్న భూ బకాసురుడు అని రామ్మూర్తి విమర్శించారు.దోపిడీని సహించకే కేసీఆర్ వెళ్లగొట్టారు.పొంగులేటి అక్రమాలను, భూ దందాలను సహించలేకే గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనను పార్టీ నుంచి బయటకు పంపించారని గుర్తుచేశారు. ఖమ్మంకు ఏం వరగబెట్టారు.జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా గత రెండున్నరేళ్లలో ఖమ్మం జిల్లాకు ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని, కేవలం తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ డబ్బు మూటలను ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు.పాలనను గాలికొదిలేసి కుర్చీలాట ఆడుతున్నారు: ఉబ్బలపల్లి నిరోషా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, అడ్వకేట్ ఉబ్బలపల్లి నిరోషా మాట్లాడుతూ కాంగ్రెస్ మంత్రులు ప్రజా పరిపాలనను పూర్తిగా పక్కనబెట్టేశారని విమర్శించారు.కుర్చీలాట – అంతర్గత కలహాలు ముఖ్యమంత్రి తర్వాత తానే నెంబర్ వన్ కావాలనే అహంకారంతో మంత్రులు కొట్లాడుకుంటున్నారే తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని నిరోషా ఆరోపించారు. పొంగులేటి సొంత నియోజకవర్గమైన పాలేరులో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో స్కూళ్లకు తాళాలు వేసే పరిస్థితి వచ్చిందని,బిల్లుల కోసం వెళ్తే మంత్రులు కమిషన్లు అడుగుతున్నారని వాపోయారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో పసికూన చెయ్యి తీసేసినా హెల్త్ మినిస్టర్ కనీసం సమీక్ష కూడా చేయలేదని దుయ్యబట్టారు.రైతుబంధు ఏది వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలోనే ఉన్నా ఇప్పటికీ రైతులకు పూర్తి స్థాయిలో రైతుబంధు అందలేదని, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని అన్నారు.శ్వేతపత్రం విడుదల చేయాలి: కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు వరకు ఖమ్మం జిల్లాలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వలేదని, దీనిపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదు తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఇలాంటి డైవర్షన్ రాజకీయాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఇరువురు నేతలు స్పష్టం చేశారు. ముసలివాళ్లకు పెన్షన్లు పెంచలేని ఈ సిగ్గుమాలిన ప్రభుత్వంపై ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని, కాంగ్రెస్ మెడలు వంచైనా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేస్తామని బీఆర్ఎస్ నేతలు బొమ్మెర రామ్మూర్తి,ఉబ్బలపల్లి నిరోషా హెచ్చరించారు.ఈ మీడియా సమావేశం లో ఉద్యమకారుడు నెమలికొండ వంశీ, నాయకులు మంచా నాయక్, షేక్ చాంద్ పాషా,షారూక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ప్రారంభించిన సర్పంచ్



**చింతకాని జూన్ 30 ప్రజాజ్యోతి :**మండల పరిధిలోని వందనం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నూతనంగా నిర్మించుకున్న జోనబోయిన వీర స్వామి – ఆదిలక్ష్మి దంపతుల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గృహ యజమానులు, వారి కుటుంబ సభ్యులు సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావును శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుతోందని తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు పొన్నం శంకర్రావు, వార్డు సభ్యులు లకావత్ సత్యనారాయణ,బోరక వెంకట్ రెడ్డి,ఆవుల చిన్న సైదులు,కాంగ్రెస్ నాయకులు,గ్రామ పెద్దలు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**చింతకాని జూన్ 30 ప్రజాజ్యోతి :**మండలంలోని నాగులవంచ గ్రామంలోని కందిమళ్ల బుచ్చిబాబు యాకమ్మ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు ని నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి శ్రీనివాసరావు ఘనంగా ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి మాట్లాడు తూ,పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు శాశ్వత నివాసం లభిస్తోందని తెలిపారు.ఇల్లు ప్రారంభమైన సం దర్భంగా లబ్ధిదారులు కందిమళ్ల బుచ్చిబాబు యాకమ్మ దంపతులకు నూతన వస్త్రములు బహుకరించినారు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు కోదండరామ స్వామి దేవాలయం చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వరరావు దేవాలయం మాజీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు,గ్రామ పెద్దలు శిలివేరు సైదులు,అనగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## మోక్షిక పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న పలువురు నాయకులు



**చింతకాని జూన్ 30 ప్రజాజ్యోతి :**లచ్చగూడెం గ్రామానికి చెందిన గరపాకుల నవీన్ సోనీ దంపతుల కుమార్తె మోక్షిక పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో జగన్నాధపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి నగేష్, గరపాకుల వెంకట గోపి, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు వడ్రానపు నరేష్ తో పాటు పలువురు నాయకులు, స్నేహితులు పాల్గొని మోక్షికకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆమె ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు
- పెండింగ్ లో ఉన్న క్లైమ్లకు నిధులు విడుదల చేయాలి
- సిఐటియు బోనకల్ మండల కన్వీనర్ గుగులోతు నరేష్



**బోనకల్, జూన్ 30(ప్రజా జ్యోతి ):**భ వన నిర్మాణ కార్మికు సమస్యలు పరిష్కరించాలని సిఐటియు బోనకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్‌మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులకు సహజ మరణానికి ఐదు లక్షల పెంచాలని, 55 సంవత్సరాలు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకి 6000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని , పెండింగ్లో ఉన్న క్లైములకు నిధులు వెంటనే విడుదల చేయాలని, ఇల్లు లేని కార్మికులకి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉపయోగము లేని సిఎస్సి హెల్త్ చెస్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బోనకల్ తాహసిల్దార్ చల్లూరి సుధాకర్ కు సిఐటియు బోనకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బిల్డింగ్ రంగం మండల అధ్యక్షులు షేక్ ఖాదర్ బాబా ( బుజ్జి మేస్త్రి), బిల్లింగ్ రంగం నాయకులు గుంటీ శీను, ఎస్ కే మీరా సాహెబ్, గుగులోతు రమేష్, నాగటి బాబు, భూక్య శ్రీను, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై ప్రకాష్



**కారేపల్లి, జూన్ 30, ప్రజా జ్యోతి:** అఖిల భారత రైతు కూలీ సంఘం పదవ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభలో జిల్లా కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కామ్రేడ్ బజ్జూరి వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సింగరేణి మండలానికి చెందిన వై. ప్రకాష్ లను మహాసభలో ఎన్నికకాబడ్డారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా శీలం సుదర్శన్ సహాయ కార్యదర్శిగా కలకొండ సురేష్ కోశాధికారిగా గొర్రెపాటి వీర స్వాముల తోపాటు మొత్తం 21 మందితో అఖిలభారత రైతు కూలిసంఘం ఏఐకే ఎమ్మెస్ ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.

## విద్యార్థులకు దుప్పట్లు వితరణ

- సర్పంచ్ మేదరి వీర ప్రతాప్.

**కారేపల్లి, జూన్ 30, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో గల కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో పేద విద్యార్థులకు సింగరేణి సర్పంచ్ మేదర్ వీర ప్రతాప్ (టోనీ) మంగళవారం దుప్పట్లు, బెడ్ సీట్లు, కార్పెట్లను వితరణగా పాఠశాల ఎస్ ఓ ఝాన్సీ సౌజన్య ఆధ్వర్యంలో అందజేశారు. కళాశాలలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం సర్పంచ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి. సమీరా కౌసర్, బి. వసంత, కే. కవిత, జి. విజయ, మమత, ఎం. స్వాతి తదితరులు పాల్గొన్నారు.



## పేదల గుడిసెలు కూల్చడం అమానుషం

- కలెక్టర్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయండి
- సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**బోనకల్, జూన్ 30 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదల గుడిసెలను ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కూల్చివేయడం అమానుషమని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం మండల కేంద్రంలో తూము ప్రకాష్ రావు భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడు తూ... తెలంగాణ రాష్ట్రంలో పేదలకు నివాస హక్కు కల్పించాల్సిన ప్రభుత్వం, వారి గుడిసెలను తొలగించడం బాధాకరమన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదలపై బుల్డోజర్లతో దాడులు చేయడం మానవత్వానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం వెంటనే గుడిసెల తొలగింపులను నిలిపివేసి, పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 1, బుధవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ముట్టడి కార్యక్రమంలో ప్రజలు, పార్టీ శ్రేణులు, గుడిసె వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యంగల ఆనంద రావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జక్కుల రామారావు, కార్యవర్గ సభ్యులు ఆ కె న పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దంపతులకు ఘన వీడ్కోలు సన్మానం

- టీ ఎస్ యూటీఎఫ్ కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో అభినందనలు



**కల్లూరు, జూన్ 30 : ప్రజా జ్యోతి** పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన చిత్తులూరు సోమేశ్వరరావు, ఆయన సతీమణి భవాని దంపతులను టీ ఎస్ యూటీఎఫ్ కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి విద్యారంగ సేవలను కొనియాడిన సంఘం నాయకులు, పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలు ఆనందాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీ ఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె. విజయ్ కుమార్, సీనియర్ నాయకుడు ఎం. వెంకటేశ్వర్లు, సిహెచ్. మధుసూదన్ రావు, బి. మహాలక్ష్మి , కె. సుకన్య, బి. స్వప్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

కారేపల్లి, జూన్ 30, ప్రజా జ్యోతి: సింగరేణి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కర్నాటి శ్రీనివాసరావు మంగళవారం పదవీ విరమణ చేశారు. పదవి విరమణ చేసిన శ్రీనివాసరావు, సతీమణి వసంత దంపతులను పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలు ఉపాధ్యాయ సంఘాల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని కొనియాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన శ్రీనివాసరావు పాఠశాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని అన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణతలో ఆయన చూపిన శ్రద్ధ మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సెంటర్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



# కల్లూరు మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

- కార్మికులతో చర్చలు విజయవంతం జీతాల చెల్లింపుపై చైర్మన్ హామీ



**కల్లూరు, జూన్ 30: ప్రజా జ్యోతి** తొమ్మిది నెలలుగా బకాయి వేతనాలను చెల్లించకపోతే జూలై 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపల్ కార్మికులు ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్, కౌన్సిలర్లు కార్మిక నాయకులతో జరిపిన చర్చల్లో కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల తరపున ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు పాల్గొన్నారు. చర్చల అనంతరం తొమ్మిది నెలల పెండింగ్ వేతనాల్లో ఒక నెల జీతాన్ని జూలై 1న, మిగిలిన ఎనిమిది నెలల వేతనాలను ఆగస్టు 1 నాటికి పూర్తిగా చెల్లిస్తామని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ సంయుక్తంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సిబ్బంది వేతనాల చెల్లింపునకు రూ.1.20 కోట్ల నిధులు అవసరమని సీడీఎంఏకు లేఖ రాసినట్లు చెప్పారు. అలాగే జిల్లా కలెక్టర్, సీడీఎంఏ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి సీడీఎంఏను ఆదేశించినట్లు వెల్లడించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ గతంలో మే 2 నుంచి 6 వరకు నిర్వహించిన సమ్మె సందర్భంగా మే 27 నాటికి పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా అమలు కాలేదని గుర్తు చేశారు. ఆ కారణంగానే మళ్లీ సమ్మెకు సిద్ధమైనట్లు తెలిపారు. అయితే ఈ సారి కూడా చైర్మన్, కమిషనర్ ఇచ్చిన హామీ పై విశ్వాసంతో ఆగస్టు 1 వరకు సమ్మెను వాయిదా వేస్తున్నామని చెప్పారు. ఆగస్టు 1 నాటికీ పెండింగ్ వేతనాలు పూర్తిగా చెల్లించకపోతే మళ్లీ సమ్మె బాట పట్టడంతో పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలోనే వారి గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కల్లూరు మున్సిపల్ అధ్యక్షుడు ఓడల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ వజీర్ మియా, ఉపాధ్యక్షులు చింతపల్లి శ్రీను, జినుగు మణిరాజ్, సహాయ కార్యదర్శులు గొల్లమందల యశోద, నల్లగట్ల చిన్న, కోలేటి అంజలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కంభంపాటి సుధాకర్, కోశాధికారి ఖమ్మంపాటి ప్రకాష్, వేల్పుల కృష్ణవేణి, మిద్దె బాబుగౌడ్, జగతి, ఎల్. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అమరజీవి సామినేని రామారావు విగ్రహావిష్కరణ

- భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న బృందా కారత్, తమ్మినేని, నున్నా, మచ్చ
- ప్రజా నాయకుడు, ఎర్ర జెండా ముద్దుబిడ్డ సామినేని

**బోనకల్, జూన్ 30 (ప్రజా జ్యోతి):** సిపిఎం రాష్ట్ర నాయకులు, చింతకాని మండల పరిధిలోనే పాతర్లపాడు మాజీ సర్పంచ్ అమరజీవి సామినేని రామారావు విగ్రహావిష్కరణ, అనంతరం భారీ బహిరంగ సభ బుధవారం పాతర్లపాడు గ్రామంలో జరుగుతుందని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు తెలిపారు. సామినేని రామారావు విగ్రహావిష్కరణ, బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ బోనకల్ మండల వ్యాప్తంగా మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం చిరునోములలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... నిస్వార్థ,పీడిత, ప్రజా నాయకుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు పాతర్లపాడు అభివృద్ధి ప్రదాత సామినేని రామారావు ను 31 అక్టోబర్ 2025న రామారావు ఇంట్లోకి ప్రవేశించి స్థానిక కాంగ్రెస్ నాయకులు అత్యంత దారుణంగా, అమానుషంగా హత్య చేశారని తెలిపారు. ఈ హత్యకు సూత్రధారులు, పాత్రధారులు, భూస్వామ్య పెత్తందారి, అరాచక శక్తులైన స్థానిక కాంగ్రెస్ హంతకులు అనేది బహిరంగ రహస్యం అన్నారు. ఈ హత్య ఉమ్మడి జిల్లాలనే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సంచలన కలిగించిందన్నారు. సామినేని రామారావుని హత్య చేసి ఎనిమిది నెలలు అవుతున్న పోలీసులు ప్రభుత్వం హంతకులను నేటికీ అరెస్టు చేయలేదన్నారు. ఈ హత్యకు కారకులైన నేరగాళ్లు దర్జాగా దొరల్లాగా బహిరంగంగా తిరుగుతూ గ్రామంలో అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తున్న పోలీసులు సినిమా చూస్తున్నట్లు చూస్తున్నారని విమర్శించారు. ఇది దొంగ పోలీస్ ఆటలాగా మారిపోయిందని ఆయన మండిపడ్డారు. శాస్త్ర, సాంకేతిక, డిజిటల్ యుగములో కరుడుగట్టిన నేరగాలను సైతం 24 గంటలలో పోలీసులు పట్టుకుంటున్నారని, కానీ సామినేని రామారావు హత్య కేసులోని హంతకులను మాత్రం ఎనిమిది మాసాలుగా ఒక్కరిని కూడా ఖమ్మం జిల్లా పోలీసులకు దొరకటం లేదంటే పోలీసు వ్యవస్థ నిర్జీవంగా మారిపోయిందని, పోలీసులపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు. అత్యంత అసమర్థ పోలీసులుగా జిల్లా పోలీసులు రికార్డుకు ఎక్కారని ఆయన ఘాటుగా విమర్శించారు. హంతకుల చేతులకు బేడీలు వేయాల్సిన పోలీసు అధికారుల చేతులకు ముందుగానే రాజకీయాధికారి సంకెళ్లు పడ్డాయని ఆయన్నారు. సామినేని రామారావు హంతకులు అధికారక పార్టీకి చెందినవారు కావటం, అందునా ఉపముఖ్యమంత్రి నియోజకవర్గానికి చెందిన వారు కావటం, అందుకే హత్య జరిగినా వెంటనే ప్రత్యక్షమైన పోలీస్ అధికారులు హంతకులను పట్టుకునే ప్రయత్నాలు వదిలేసి వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అని కోడి గుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మూడు మసాలా పాటు రామారావు కుటుంబ సభ్యులను మానసికంగా వేధించారన్నారు. పాలిగ్రాఫ్ టెస్టుల డ్రామాకు తెరదించారన్నారు. కిరాయి రాతలతో సిపిఎం పార్టీపై కూడా అనుమానాలు కలిగించే తప్పుడు ప్రచారాలు సాగించారన్నారు. కళ్ళకు అబద్ధాలు, అసత్యాలు గంతలు కట్టుకున్న పోలీసులు నేరస్థులు దొరకటం లేదు అని చెప్పి కేసును మూసివేయాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ గ్రామ ప్రజలకు నేరస్తులు రోజు కనిపిస్తూనే ఉన్నారన్నారు. సామినేని రామారావు గ్రామ పంచాయతీని గెలుసుకోవాలని, తమ పెత్తందారి,అరాచకాలు ఎదురులేకుండా చేయాలనుకున్న వారి కలల కలలగానే మిగిలిపోయాయి అన్నారు. సామినేని రామారావు హంతకులకు ప్రజలే రాజకీయ శిక్ష విధించారన్నారు.

### ››› సామినేని రామారావును హత్య చేసిన... ఆయన ఆశయాన్ని చంపలేరన్నారు.

విద్యార్థి దశలోనే వామపక్ష విప్లవ భావాలతో ప్రభావితమైన సామినేని రామారావు డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగ ఉపాధి కోసం వెళ్లకుండా గ్రామానికి వచ్చాడని తెలిపారు. సిపిఎం పార్టీలో సభ్యునిగా చేరి గ్రామాభివృద్ధికి ప్రణాళికలు వేశారన్నారు. ఇది సహించలేని స్థానిక కాంగ్రెస్ భూస్వామి పెతందారులు తప్పుడు కేసులలో, నిర్బంధాలు, భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు. ప్రజా చైతన్యం ద్వారా వాటినన్నిటిని ధైర్యంగా ఎదుర్కొంటూ వచ్చారన్నారు. గ్రామ సర్పంచ్ గా రెండుసార్లు ఎన్నికయి గ్రామ రూపురేఖలను మార్చారన్నారు. తన సొంత భూమిని 20 ఎకరాలు ఇచ్చి వందలాదిమంది దళితులకు, బలహీన వర్గాలకు కాలనీ ఏర్పాటు చేశారన్నారు. 40 సంవత్సరాలు పంచాయతీలో సిపిఎం పాలన సాగింది అన్నారు. ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతు సంఘం కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి గా, పార్టీ ఉమ్మడి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉమ్మడి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా అనేక ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. 74 సంవత్సరాల వయసులో గ్రామంలో ఉంటూ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు హత్య చేశారన్నారు. ఆయన రక్తంతో ఎర్రజెండా మరింత అరుణమై ఎరుపెక్కిందన్నారు. దోపిడీ, అసమానతలు ఉన్నంతకాలం రామారావు ప్రజా ఉద్యమాలలో ఎర్రజెండా రెపరెపరులలో జీవించే ఉంటాడన్నారు. బహిరంగ సభకు సిపిఎం శ్రేణులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యల హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

### ››› బహిరంగ సభకు హాజరయ్యే నేతలు...

సామినేని రామారావు విగ్రహవిష్కరణకు, బహిరంగ సభకు మాజీ ఎంపీ సీపీఎం జాతీయ నాయకురాలు బృందా కారత్, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు , ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిలు నున్నా నాగేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బండి పద్మ, పలువురు జిల్లా డివిజన నాయకులు పాల్గొంటారని మడిపల్లి గోపాలరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, చిరునోముల మాజీ ఎంపిటిసి నిమ్మతోట ఖానా, మాజీ ఉపసర్పంచ్ నీలకంఠం రాము, చాపలమడుగు శ్రీనివాసరావు, గోళ్ళ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# వెల్ఫేర్ బోర్డు నిర్ణయానికి వ్యతిరేకంగా సీఐటీయూ ధర్నా

- సి ఎస్ సి హెల్త్ టెస్టుల దందా ఆపాలి
- మల్లూరు చంద్రశేఖర్(బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు)
- నాయబ్ తహశీల్దార్ లక్ష్మణ్ కు వినతి



**వేంసూరు,జూన్30 ప్రజాజ్యోతి**

తెలంగాణ రాష్ట్రంలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు 2009 వరకు పోరాడి వెల్ఫేర్ బోర్డును సాధించుకున్న విషయం పాఠకులకు విదితమే.ఆ బోర్డు నుండి కార్మికులకు అందించే సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థలకు ఇవ్వొద్దంటూ సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట గంటపాటు దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ ధర్నా నిర్వహించారు.నాయబ్ తహశీల్దార్ లక్ష్మణ్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆయన స్పందించి ఉన్నతాధికారులకులేఖ రాస్తామని హామీ ఇచ్చారు. ముందుగా స్థానిక ఎర్రారామయ్య భవనం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు.అనంతరం జరిగిన నిరసన సభలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బోర్డు అడ్వైజరీ కమిటి ను రద్దు చేసి తనకు ఇష్టం వచ్చినట్లు బోర్డు లో ఉన్న కార్మికుల సొమ్మును దుబారా చేస్తుందన్నారు.కార్పొరేట్ సంస్థలకు కార్మికుల సంక్షేమాన్ని అప్పగిస్తూ కార్మికులకు బీమా అనే పేరుతో అదనపు సొమ్మును ట్రైల్ బ్లేజర్ సంస్థకు ప్రీమియం పేరుతో దోచి పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తక్షణమే బోర్డు అడ్వైజరీ కమిటి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అంతే కాకుండా సి.ఎస్.సి. అనే సంస్థకు హెల్త్ టెస్టుల పేరుతో దందా చేస్తూ కోట్ల రూపాయల సొమ్మును కట్టబెడుతూ ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఖజానా ఖాళీ చేస్తుందన్నారు.అట్టి లీజును రద్దు చేయాలని కోరారు.టెస్టులతో కార్మికులకు ఒరిగిందేమీ లేదని నేరుగా బోర్డు నుండి కార్మికులకు వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు.పెండింగ్ లో ఉన్న క్లైమ్ లు పరిష్కారం చేయాలని ట్రైల్ బ్లేజర్ సంస్థ వద్ద మూలుగుతున్న మరణాల సహాయాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆన్లైన్ లో వస్తున్న సర్వర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.సాధారణ మరణం చెందినప్పుడు నామిని కు ఇచ్చే రెండు లక్షల రూపాయల సహాయాన్ని 05 లక్షలకు పెంచాలని,ప్రసూతి,వివాహ కానుకలను 30 వేల నుండి లక్ష రూపాయలకు పెంచాలని,లేబర్ ఆఫీస్ లలో బ్రోకర్స్ వ్యవస్థను అరికట్టాలని,55 ఏళ్ళు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 6 వేలు చొప్పున బోర్డు నుండి పింఛను ఇవ్వాలని, పిల్లల చదువులకు స్కాలర్ షిప్పు లు ఇవ్వాలని,కార్మికుని స్వంత గృహ నిర్మాణానికి బోర్డ్ నుండి ఐదు లక్షలు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో: వేంసూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మీరావలి,సారంగుల మల్లేశ్వరరావు, కాకర్ల శ్రీను, తిప్పిశెట్టి శివ,కందిమల్ల నాగరాజు,పిన్నబోయిన శివ, బింగి మధుసూదన్ రావు, మునియ్య,పరిగడుపు చంటి,సత్యవతి పాల్గొన్నారు.

# జమలాపురం శ్రీవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి దేవాలయంలో జీర్ణోదరణ, ధ్వజ ప్రతిష్ట సహిత మహా కుంభాభిషేకం కార్యక్రముములో భాగంగా మంగళవారం నాడు ఉదయం 07-00ని"లకు చతుర్వేద పారాయణ, స్థానములు నవగ్రహ హోమములు అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారికి మరియు అలివేలు మంగమ్మ అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకము నీరాజన మంత్ర పుష్పముల కార్యక్రమము నిర్వహించటం జరిగినది. సాయంత్రం 04-00 మన్యసూక్త హోమం, మూల మంత్ర హోమము నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయ దేవ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ, వకుళ మాత స్టేడియం నిర్మాణదాత తుళ్లూరు కోటేశ్వరరావు, గ్రామస్తులు భక్తులతో పాటుగా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**కల్లూరు, జూన్ 30 : ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 20 వ వార్డులో వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. వార్డులో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను ప్రోక్లైన్ యంత్రం ద్వారా తొలగించే పనులను వార్డ్ కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు పర్యవేక్షణలో చేపట్టారు. వార్డు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడం వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న కౌన్సిలర్ పుల్లారావు చొరవను స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హబీబ్, ఉపేందర్, బొడ్డు తిరుపతిరావు, స్థానికులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమ ప్రభుత్వం

**నేలకొండపల్లి, జూన్ 30 ప్రజా జ్యోతి :**తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో రైతు భరోసా కార్యక్రమం ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి నిధులు విడుదల చేయగానే... చప్పట్లు ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. రైతు భరోసా తో రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం రైతు ను రాజు ను చేసేందుకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులు అందుకుని వ్యవసాయం లో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం రైతులకు పత్తి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, రైతు ప్రతినిధులు కొడాలి గోవిందరావు, యం.వెంకన్న, బొందయ్య, కడియాల నరేష్, ఆయా పంచాయతీ సర్పంచ్ లు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల అభివృద్ధిలో షేక్ మదార్ కృషి అభినందనీయం

- సర్పంచ్ బట్టా అంజన బాబు



**మధిర ప్రజా జ్యోతి** మండలం పరిధిలోని యుపి ఎస్ ఖమ్మంపాడు లో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ మంగళ వారం ఉద్యోగ విరమణ గావిస్తున్న షేక్ మదా ర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్ట అంజన బాబు మాట్లాడుతూ 28 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘ కాలం పాటు ఖమ్మం పాడు పాఠశాలలో హిందీ పండిట్ గా పనిచేస్తూ ఖమ్మంపాడు పాఠశాల అభివృద్ధిలో విశేష కృషి చేసిన మదార్ గ్రామం తరపున అభినందనలు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. వృత్తి పట్ల అంకితభావం నిబద్ధతతో పనిచేస్తూ ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారని తన ఉద్యోగ ప్రస్థానం యు పి ఎస్ ఖమ్మంపాడు లో ప్రారంభమై 19 సంవత్సరాలు సుదీర్ఘకాలం ఖమ్మంపాడులో పనిచేసి గ్రామస్తులు తల్లిదండ్రులుతో మంచి ఉపాధ్యాయునిగా పేరు తెచ్చుకున్నారని ఉద్యోగ విరమణ కూడా మా పాఠశాలలోనే జరుపుకోవడం హర్షించదగిన పరిణామమని పేర్కొన్నారు. వారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భావి జీవితం సుఖ సంతోషాలతో గడవాలని సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా వారు పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏ ఏ పి సి చైర్మన్ బంక మాణిక్యమ్మ గ్రామస్థులు దిరిశాల రాము, మధుబాబు ఉపాధ్యాయులు ఆర్ బ్రహ్మారెడ్డి యం డి జమీర్ వి.లక్ష్మారెడ్డి వి.లక్ష్మీప్రసన్న కె సునీత,మాజీ ప్రధానోపాధ్యాయులు ఆర్ వి.సత్య నారాయణ మదార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలు అభివృద్ధి పై చర్చ కు రావాలి

- మంత్రి శ్రీనివాసరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు
- స్థానిక సంస్థల ఎన్నికలతో బీఆర్ఎస్ కనుమరుగు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు



**నేలకొండపల్లి, జూన్ 30 ప్రజా జ్యోతి:**బీఆర్ఎస్ నేతలకు పాలేరు అభివృద్ధి కనిపించటం లేదని...బహిరంగ చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు సవాల్ విసిరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...ఎమ్మెల్సీ తాతా మధు అభివృద్ధిని చూసి తట్టుకోలేక మంత్రి శ్రీనివాసరెడ్డి పై అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. సొంత మండలం లోనే హద్దులు తెలియని నాయకులు మంత్రి పై విమర్శలు చేయటం సిగ్గుచేటు అన్నారు. పాలేరు లో కనివిని ఎరగని రీతిలో అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుంటే జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ కనుమరుగు కావటం ఖాయమని పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసున్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి పై తప్పుడు ఆరోపణలు చే స్తే సహించేది లేదని హెచ్చరించారు. పాలేరు ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోట అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, రాయపూడి నవీన్, దోసపాటి శేఖర్, చిలకబత్తిని వీరబాబు, కైలాసపు వెంకటేష్, కడియాల నరేష్, సర్పంచ్ లు కట్టెకోల నాగార్జున, కుక్కల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న బిల్లులను తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్



**నేలకొండపల్లి, జూన్ 30 ప్రజా జ్యోతి:** ప్రభుత్వం రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్న పంట నిమిత్తం పెండింగ్ లో ఉన్న బిల్లులను తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం మన రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శ్రీకర గార్డెన్స్ లో జరిగిన తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల వద్ద నుండి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి నెలలు గడుస్తున్న ప్రభుత్వం సంబంధిత బిల్లులను నేటికీ చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుత వానా కాలం పంట పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. మరోవైపు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా డబ్బులను కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో పెట్టుబడుల నిమిత్తం రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి గత్యంతరం లేక అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎరువుల పంపిణీలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్లైన్ యాప్ ను తక్షణమే రద్దు చేసి మునుపటిలాగే రైతులకు నేరుగా అందించాలన్నారు. యాప్ పద్ధతి వల్ల సాంకేతిక లోపాలతో పాటు భూమి కలిగిన సొంత రైతులు సుదూర ప్రాంతాలలో ఉండటం వల్ల యూరియా కోసం కౌలు రైతులు, భూమి కలిగిన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షుడు బిక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు మల్లెల సన్మంతరావు, రచ్చ నరసింహారావు, ఇంటూరి అశోక్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, ఎడవల్లి రమణారెడ్డి, ఎడ్ల తిరుపతిరావు, గుడవర్తి వెంకటేశ్వర్లు, తోట పెద్ద వెంకటరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కొప్పుల ఉపేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్స్ పంపిణీ




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం సుదర్శన్ ఫౌండేషన్ అధినేత, పాస్టర్ జగదీష్ పాల్ ఆధ్వర్యంలో 90 మంది పేద విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్ లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా గురునాథరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్స్ అందజేయడం అభినందనీయమని, పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న జగదీష్ పాల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ, ఉపాధ్యాయులు చిన్నప్ప, సాంబయ్య, స్వాతి,లక్ష్మి ఎలోహిమ్ ప్రార్థన మందిర్ విశ్వాసులు పొదిలి వెంకయ్య,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి





- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన,పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి,సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు,విద్యుత్,టాయిలెట్,డార్మెటరీ,ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి,నివేదిక సమర్పించాలని,తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్,టాయిలెట్ వ్యర్థాలు, మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖ లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్న స్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు,టాయిలెట్ల మరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలు లేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు,బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘీక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్,ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సై కి ఘనంగా సన్మానం

- మత్స్యశాఖ పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు రాధా కృష్ణమూర్తి.
- మంగాపురం సర్పంచ్ ధీరావత్ అశోక రాణి





**నేలకొండపల్లి, జూన్ 30 ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలోని నూతన ఎస్సై గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస రెడ్డి ఎస్సై ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మధ్య శాఖ పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, ఘనంగా సన్మానించారు, మరియు మంగాపురం తండా సర్పంచ్ తీరావత్ అశోక రాణి ఘనంగా సన్మానించారు.నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య,బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న,బచ్చలకూరి నాగరాజు,మైసా శంకర్,రాయపూడి నవీన్,యడవల్లి సైదులు,నంబూరి రామారావు,గుడిబోయిన వెంకటేశ్వర్లు,లక్కమ్ ఏడుకొండలు, సర్పంచ్ లు కట్టెకోల నాగార్జున,కుక్కల నరేష్,మార్తి కోటి,కడియాల నరేశ్ దిరావత్ రాధా కృష్ణమూర్తి, రెడ్డి, సీతా నాయక్, మంగాపురం సర్పంచ్ దిరావత్ అశోకా రాణి,తదితరులు పాల్గొన్నారు

## మోటార్ల లో..రాగి తీగలు చోరీ



**నేలకొండపల్లి, జూన్ 30 ప్రజాజ్యోతి :** మండలం లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లో రాగి తీగలు చోరీ కి పాల్పడ్డారు. బాధిత రైతుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలలో మంగళవారం గుర్తు తెలియని దుండగలు రెండు ట్రాన్స్ పార్మర్ల ను పగలగొట్టి అందులో ఉన్న రాగి, తీగలను చోరి చేశారు. బాధిత రైతులు స్థానిక పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రైతులు సమాచారం మేరకు చోరీ జరిగిన విద్యుత్ మోటార్లు ను క్షేత్ర స్థాయిలో నేలకొండపల్లి విద్యుత్ సంస్థ ఏఈ జీ.రవి పరిశీలించారు. రైతుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు అప్రమతంగా ఉండాలని సూచించారు. అనుమానితులు ఉంటే తమ సిబ్బంది సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది హనుమంతరావు, ' "వెంకటేశ్వర్లు లు ఉన్నారు.